# పదమూడవ ప్రసంగము.

ఆ రోజులలో శ్రీస్వామి ప్రకాశానందులవారు గోండలులో ఉండిరి. వారు పీఠడియా వెళ్ళవలసియుండెను. ఇది తెలిసికొని అచ్చటి వైద్యులు రాఘవజీభాయి వారిని అడిగెను. తమరు ఎక్కడికి వెళ్ళెదరు?

స్వా॥ ప్ర॥ :- నేను పీఠడియా వెళ్ళదలచి యున్నాను. అచ్చట శ్రీ నిత్యానందస్వామివారను మహాపురుషులు ఉన్నారు.

రాఘవ :- నేనుకూడ తమతో వారిదర్శనమునకు రావచ్చునా?

స్వా॥ ప్ర॥ :— ఏమి అభ్యంతరము లేదు.

అంతట వారిరువురును పీఠడియా వెళ్ళి నిత్యానందులవారిని దర్శించిరి.

స్వామివారు ఎంతయో సంతోషించి వారు స్వయముగా చెంబుతో నీళ్ళునింపి తీసికొనివచ్చి పాద్యమునకు సమర్పించిరి.

స్వా. ప్ర. :—స్వామీ, తమకు ఇంతమంది సేవకులు ఉండగా, తమరు స్వయముగా ఎందుకు శ్రమపడవలెను?

## స్వామివారి సేవాభావము.

స్వా. ని. :—రుక్మిణి శ్రీకృష్ణభగవానుని పరిచర్యలు చేయుటకు ఎల్లప్పుడును నిలబడి ఉండెడిది. ఇది చూచి ఒకరు ఇట్లు ప్రశ్నించిరి. అమ్మా తమ ఆజ్ఞలను నెరవేర్చుటకు ఇంతమంది దాసదాసీజనములు ఉండగా తామే ఏల ఇట్లు నిలబడి ఉన్నారు? ఆమె సమాధానము చెప్పెను :—

"నాకును శ్రీకృష్ణునకును పరిణయమైనది. దాసీలకు జరుగలేదు. కావున ఆయనను సేవించుటకు నిలబడియుండుట నాధర్మము. నాకు ఉన్నప్రేమ దాసీలకు ఉండదు."

అదేవిధముగా నాకు మీయందు ఉన్న ప్రేమ దర్బారు నౌకరులకు ఉండదు. మీకు స్నేహితులు చాలమంది గొప్పవారు ఉన్నారు. మీరు వారిని వదలి దూరమునుండి ఇక్కడికి చాలసార్లు వచ్చుచున్నారు. కాని నేను మాత్రము ఒక్కసారి అయినా రాలేక పోవుచున్నాను. నేను ఖైదులోపెట్టిన పాత అపరాధివంటివాడిని. ఇట్లనుచుండగానే వారి హృదయమునందలి ప్రేమ పొంగి పొర్లి పోయెను. వారి కంఠము గద్గదమయ్యెను.

## అన్యోన్యాకర్షణము.

స్వా. ప్రే. :—నేను ఎప్పుడు బయలుదేరాలన్నా ఏవో ఇబ్బందులు కలుగుచునే యుండెను. వాటినన్నిటిని తప్పించుకొని నే నిచ్చటికి వచ్చుటలో తమలో సహజముగా నున్న ఆకర్షణమే కారణము. అందుచేతనే ఇచ్చటకు వచ్చుటకు ఏదోవిధముగా ప్రయత్నించుచునే ఉందును.

స్వా॥ ని॥ :— ఇది అన్యోన్యాశ్రియమే. నేనుకూడ తమరిని తరుచుగా తలచుకొనుచు మీరాకకు ఎదురు చూచుచునే ఉందును.

## రోమరోమములనుండినిత్యము వెలువడుఅపూర్వప్రేమనాదము

కృష్ణభగవానునకు ఎల్లప్పుడు అర్జునునివద్దకు వెళ్ళవలెనను తలంపు ఉండెడిది. ఇది రుక్మిణికి చాలకష్టముగా నుండెను. ఆమె చాలమార్లు ఇట్లనెను:_ "తమకు సేవచేయుటకు నేను సిద్ధముగా నున్నాను. అయినను మీరు అర్జునునివద్దకే నిత్యము పరుగెత్తు చున్నారు. అర్జునునియందలి గొప్ప ఏమి?" ఇట్లు అనేక మారులు రుక్మిణి చింతించెను. ఒకరోజున మామూలువలె అర్జునుని చెంతకు వెళ్లుటకు కృష్ణుడు ప్రయత్నము చేయసాగెను. ఆరోజున యాదవులకు కృష్ణుని అవసరము ఎక్కువగ నుండెను. కృష్ణుని ఉండ మని వారు ఎంతైన పట్టుపట్టిరి. రాణులు అంతఃపురమునకూడ

ఆరోజున ఏదియో ఉత్సవము ఉండెను. కావున రుక్మిణి మొదలగు పట్టమహిషులు ఆయనను ఆపుటకు ఎంతైన ప్రయత్నించిరి. అయినను ఎప్పటివలె కృష్ణుడు అర్జునునిచెంతకు వెళ్ళిపోయెను. ఆయన వెళ్ళుసరికి అర్జునుడు వేటకు వెళ్ళి అలసటతో తిరిగి వచ్చెను. అంతట స్నానముచేసి మంచముపై పరుండియుండెను. ద్రౌపది తడిసిన అతని కేశములను సవరించుచుండెను. ద్రౌపది కృష్ణునికి ఆసనము తీసికొని వచ్చుటకు లోనికి వెళ్ళెను. ఇంతలో కృష్ణుడు అచ్చటనే కూర్చుని అర్జునుని కేశములను విడదీయసాగెను. ఎంతయో పట్టుదల పట్టినను ఆగక కృష్ణుడు వెళ్లిపోయినందున రుక్మిణి క్రోధముతో శ్రీకృష్ణుడు అక్కడకు వెళ్ళి ఏమిచేయుచున్నాడో చూచుటకు వచ్చెను. కృష్ణుడు అర్జునుని కేశములు ఆరబెట్టుట చూచి రుక్మిణికి చాలకోపము కలిగెను. కాని అర్జునుడు నిద్రించుచున్నందున నిద్రాభంగము చేయవలదని కృష్ణుడు సంజ్ఞచేసెను. ఆమెనుకూడ అర్జునుని కేశములను ఆరబెట్టుమనెను. ఆమెకూడ ఆపనియందు నిమగ్నురాలయ్యెను. తల ఆరినదో లేదో చూడమని సంజ్ఞచేయుచు అతని కేశములను ఆమె బుగ్గలకు స్పృశింపజేసెను. ఈసంజ్ఞ తెలిసికొనిన రుక్మిణియొక్క క్రోధమునకు మేరలేదు. కాని భగవానుని ఆజ్ఞకు లోబడి తనబుగ్గలదగ్గర అర్జునుని కేశములను ఉంచుకొని పరీక్షించెను. ఆమెకు ప్రతి కేశమునుండియు "కృష్ణ కృష్ణ" అనునాదము వినిపించెను. అంతట ఆమెకు శ్రీకృష్ణునిపై తనకుఎంతయో ప్రేమకలదను అభిమానము తప్పిపోయెను. అర్జునునకు పరమాత్మునిపై గల అపూర్వమగు ప్రేమ అర్థమయ్యెను. ఆమె ఎంతయో సిగ్గుపడెను.

స్వా॥ ప్ర॥:— భగవానుడే చెప్పెను కదా:—

యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్ ।

"ఎవరు నన్ను ఎట్లు పొందెదరో అట్లే వారిని నేను పొందుదును." ప్రేమ అన్యోన్యాశ్రయముగా నుండునని దీనితాత్పర్యము.

## సన్యాసికి నమస్కారముచేయుట ప్రజలధర్మము.

అనంతరము రాత్రి వైద్యరాఘవజీభాయి నిత్యానందస్వామి వారిని కడు స్తుతించి పలికెను. "నేను చాల ప్రదేశములు తిరిగితిని. అనేకమంది సాధువులను సత్పురుషులను దర్శించితిని. కాని వారిలో చాలమందియందు డంబము, పాషండత్వము మాత్రమే కన్పించెను. కావున ఈరోజులలోని సన్యాసుల విషయములో నాకు శ్రద్ధ లేదు. బాపుజీ (శ్రీస్వామిప్రకాశానందులవారు) తమరిని స్తుతించిరి. అది విని నేను ఇక్కడికి వచ్చితిని.

స్వా॥ ని॥:— సత్పురుషు లందరు సమానమే. శ్రద్ధతో సన్యాసులకు నమస్కారముచేయుట జనుల ధర్మము.

రాఘవ:— కాని సన్యాసముపేర వేషముమాత్రమే ఉండి, ప్రజల కంట్లో దుమ్ముకొట్టేవాడు సన్యాసేనా?

## కపటము త్యాజ్యము, క్షుద్ర కర్మ.

స్వా. ప్ర॥:- మనువు బ్రాహ్మణుల నుద్దేశించి ఇది చెప్పెను:-

*న ధర్మస్యాపదేశేన పాపం కృత్వా వ్రతం చరేత్ ।*
*వ్రతేన పాపం ప్రచ్ఛాద్య కుర్వన్ స్త్రీశూద్రదమ్భనమ్ ॥*

"ధర్మమును వంకపెట్టి పాపములను చేయుచు వ్రతములను ఆచరించరాదు. వ్రతాదులచే పాపములను దాచి ఆడువారిని, తెలివి లేనివారిని మోసగించరాదు."

మహారుద్రయాగము, విష్ణుయాగము అను పేర్లతో ధర్మము వంకపెట్టి ప్రజలదగ్గరనుండి డబ్బులాగి సగముమాత్రమే ఖర్చుపెట్టి మిగిలిన సగము స్వంతకాతాలో జమకట్టుచు ఉందురు. ఆపాపము పోవుటకు తరువాత కృచ్ఛ్రచాంద్రాయణాదులు చేయుచుందురు. అట్లు చేయరాదు. మూలశ్లోకమున స్త్రీలను, శూద్రులను మోసగించరాదు అని ఉన్నది. కారణమేమన, ఆరోజులలో స్త్రీలు,

శూద్రులు మాత్రమే చదువురానివారు. మిగిలిన మూడువర్ణముల వారును వేదశాస్త్రములను అభ్యసించుటచే ధర్మాధర్మములను తెలిసికొనగలిగెడివారు. కాన వారిని మోసముచేయుటకు వీలుపడెడిది కాదు. ఇప్పుడు కొద్దో గొప్పో చదువుకున్నను అందరును మోసగింపబడుటకు వీలుగనే ఉన్నారు. ఆరోజులలో మోసగించేపని మీది— అనగా బ్రాహ్మణులది. ఇప్పుడు మాది— అనగా సన్యాసులది.

రాఘవ:—గృహస్థులు దారాపుత్రాదుల చిక్కులు ఉండుటచే రోజులు గడుపుకొనుటకు మోసము చేయుదురు. కాని సన్యాసులు మోసము చేయవలసిన అవసరమేమి?

స్వా॥ ప్ర॥ :—వారు గృహస్థాశ్రమము తీసికొనవలసిన అవసరమేమి ఉంది? పెండ్లి చేసికొని పిల్లలను పుట్టించిన పాపము అని శాస్త్రములయందు ఉన్నది.

రాఘవ:—గృహస్థులు లేకపోయినచో మీవంటి మహాత్ములు ఎట్లు పుట్టెదరు.

స్వా॥ ప్ర॥ :—గృహస్థులు మాత్రము మోసము చెయ్యవచ్చుని ఎక్కడనైన ఉన్నదా? భాగవతమునందు చెప్పబడినది:—

*బ్రాహ్మణస్య చ దేహోఽయం క్షుద్రకామాయ నేష్యతే॥*

"ఈ బ్రాహ్మణ శరీరము తప్పుడుపనులు చేయుటకు కాదు." అని దాని అర్థము.

రాఘవ:—అయితే బ్రాహ్మణధర్మము లేమిటో చెప్పండి.

## గీతయందలి బ్రాహ్మణ ధర్మములు.

స్వా॥ ప్ర॥ :—నేనేమి చెప్పుదును. భగవానుడే గీతయందు చెప్పెను.

*శమో దమః తపశ్శౌచం క్షాన్తిరార్జవమేవ చ।*
*జ్ఞానవిజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్॥*

"శమము, దమము, తపస్సు, పవిత్రత, క్షమ, నిష్కపటము, శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, ఆస్తికత్వము- ఇవి బ్రాహ్మణుల స్వాభావిక గుణములు."

## శ మ ము

శంకరాచార్యులు శమమును వ్యాఖ్యానించుచు "సదైవ వాసనాత్యాగః శమోఽయమితి శబ్దితః" నిరంతర వాసనాత్యాగము శమమని చెప్పబడును. దృఢభావనముతో, పూర్వాపరవిచారము లేకుండ, విహిత, నిషిద్ధ వస్తుభేదమును పాటించక వస్తువులను గ్రహించుట వాసన అనబడును. ఆ వాసన రెండు రకములు— 1. శుభవాసన 2. అశుభవాసన. అశుభవాసన మానవుని బంధించుటకు కారణము. శుభవాసన ముక్తికి ద్వారము. అశుభవాసన లన్నిటిని త్యజించుట శమము. యోగవాశిష్ఠమున ఇట్లు చెప్పబడినది:-

మానసీ వాసనాః పూర్వం త్యక్త్వా విషయవాసనా।
మైత్ర్యాదివాసనా రామ గృహాణామలవాసనాః ॥

"ఓ రామ! మానసవాసనలను, విషయవాసనలను త్యజించుము. మైత్ర్యాదులు (మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష) నాలుగు వాసనలు గ్రహించుము."

## శబ్దాదివిషయములను అనుభవించు పద్ధతులు.

శబ్దము మొదలగు విషయములను రెండురకములుగా అనుభవించవచ్చును. 1. కామ్యమానత్వము 2. భుజ్యమానత్వము. కామ్యమానత్వము అనగా మానసికవాసనలద్వారా శబ్దాదివిషయములను అనుభవించవలెనను కోరిక. భుజ్యమానత్వము అనగా మానసికవాసనల పరిణామరూపమున శబ్దాదులను అనుభవించుట. ఈ రెంటినికూడ పరిత్యజించవలెను. ముక్కులో దుర్గంధముతో కూడిన పదార్థము ఉన్నంతకాలము సుగంధము తెలియనట్లుగనే

మలిన వాసనలతో చిత్తము నిండియున్నప్పుడు శుభవాసనలు లభించవు. శుభవాసనలు కలుగనంతకాలము ఆత్మ సాక్షాత్కారము అసంభవము.

## దమము.

*నిగ్రహో బాహ్యవృత్తీనాం దమ ఇత్యభిధీయతే ।*

బాహ్యవృత్తినిగ్రహము— అనగా శ్రోత్రము, త్వచము, చక్షువు, జిహ్వ, ఘ్రాణము— ఈ 5 జ్ఞానేంద్రియములను వాక్కు, హస్తము. పాదము, గుదము, ఉపస్థము— ఈ 5 కర్మేంద్రియములను శాస్త్రనిషిద్ధములగు కర్మములనుండి ఆపుట, వానియందు ప్రవర్తించనీయకుండుట దమము.

## దశేంద్రియములు.

ఇంద్రియములను నిగ్రహించకపోయినచో విషయప్రవృత్తములయిన ఇంద్రియములు ముముక్షువును శ్రేయోమార్గము (మోక్షమార్గము) నుండి క్రిందకు త్రోసివేయును అని మనువు చెప్పెను:—

*ఇన్ద్రియాణాం తు సర్వేషాం యదేకం క్షరతీన్ద్రియమ్ ।*
*తేనాస్య క్షరతి ప్రజ్ఞా దృతేః పాదాదివోదకమ్ ॥*

"ఇంద్రియములలో ఏ ఒక్కటి క్షరమయినను పురుషుని ఆత్మ విషయకమగు బుద్ధి నశించును. తోలుసంచియందు ఛిద్రము పడినంతనే నీరు పోవునట్లు అతని బుద్ధి పోవును."

కన్నము ఉన్న కుండలో ఎన్నిమారులు నీరు పోసినను కుండ ఖాళీగా ఉండును. శరీరమను కుండలో పదియింద్రియము లనెడు పది కన్నములు కలవు. ఆ ఇంద్రియములను నిగ్రహించకపోయినచో ఎన్ని శ్రవణాదిసాధనములు ఉన్నను ఆత్మవిషయకమగు బుద్ధి స్థిరముగా నుండదు. కన్నముఉన్న కుండవలె ఎప్పుడును లోపల ఖాళీగనే ఉండును.

## మనస్సు ఇంద్రియములకు రాజు.

దశేంద్రియములును మనస్సు అధీనములో నుండును. రాజును పట్టుకొనినచో ఎట్లు సైన్యము అంతయు వశపడిపోవునో, అటులనే మనస్సును జయించినచో ఇంద్రియములన్నియు వశపడిపోవును.

మనుస్మృతిలో నిట్లున్నది:—

*ఏకాదశం మనో జ్ఞేయం స్వగుణేనోభయాత్మకమ్ ।*
*యస్మిన్ జితే జితావేతౌ ద్వాగుణపఞ్చకౌ గణౌ ॥*

"మనస్సు పదకొండవ ఇంద్రియము. తన గుణమునుబట్టి జ్ఞాన కర్మేంద్రియాత్మకము. అది జయింపబడినచో జ్ఞానేంద్రియపంచకమును, కర్మేంద్రియపంచకమున్ను జయింపబడిన వగును.

## మనస్సు వివేకముచే జయించబడును.

మనస్సును జయించుటకు వివేకము ముఖ్యము. బాలుడు మలమూత్రములయందు ఆడుకొనును. పెద్దవాడైన తరువాత వాని చెంతకు చేరడు. అటులనే విషయముల వాస్తవస్వరూపము తెలియనంత వరకు వానియందు రమణీయబుద్ధిని కలిగియుండును. వానిని జయించడు. వస్తువుయొక్క అసలు స్వరూపమును తెలిసికొనినతరువాత అవి చెంతనున్నను వానియందు ప్రవృత్తి కలుగదు. విషయములకు దూరముగా నున్నంతమాత్రమున వానిని జయించినట్లు కాదు.

కపిలుడు చెప్పెను:—

*నిస్సఙ్గేఽప్యుపరాగోఽవివేకాత్ ।*

నిస్సంగత్వమునందుకూడ అవివేకముచే రాగము కలుగును. అవివేకము ఉన్నంతకాలము స్త్రీలయందు రమణీయతాబుద్ధి యుండును. వారికి దూరముగానున్నను వారి దర్శనముచేతనే లేక స్మరణముచేతనే మనశ్చాంచల్యము సంభవము. కాని శరీరము అస్థిమాంసాది పూరితమని తెలిసికొని వైరాగ్యమును పొందినప్పుడు వారి

ఎదుట నిలబడినను మనశ్చాంచల్యము కలుగదు. కావున వివేకము ద్వారా ఇంద్రియములను నిగ్రహించు సామర్థ్యము కలుగును.

## తపము

వ్యాకరణమున "తప" శబ్దమునకు బాధించుట (తపింపజేయుట)అని అర్థము వ్రాయబడినది. అందుకొరకు శరీరమును తపింపజేయు చాంద్రాయణాది వ్రతములు తపములుగా పేర్కొనబడినవి.

*వేదోక్తేన ప్రకారేణ కృచ్ఛ్రచాన్ద్రాయణాదిభిః ।*
*శరీరశోషణం యత్తత్తప ఇత్యుచ్యతే బుధైః ॥*

"శాస్త్రోక్తప్రకారము కృచ్ఛ్ర, చాంద్రాయణాది వ్రతముల ద్వారా శరీరము ఎండింపజేయుట, తపము అని విద్వాంసులు జెప్పుదురు" అని సూతసంహితలో చెప్పబడినది. ఏదైన పాపకార్యము జేసినప్పుడు ఆపాపప్రాయశ్చిత్తమునకు చేయు తపములు ఇవి. ముముక్షువునకు చాంద్రాయణాదులు ధాతువైషమ్యముచే హానిని కలుగజేయును. శరీరమున బాధలు కలుగును. కావుననే ముముక్షువునకై శరీర, మనో, వాక్కులచే మూడు రకములగు తపస్సులను భగవానుడు గీతయందు తెలిపెను.

## గీతోక్తములగు త్రివిధతపములు.

*దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।*
*బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥*

దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను, పూజించుట పవిత్రముగా నుండుట, నిష్కపటముగా నుండుట, బ్రహ్మచర్యము, అహింస—ఇవి శారీరకతపములు.

*అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।*
*స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥*

"ఇతరులను ఉద్రేకపరచనివియు, సత్యము, ప్రియము,హితకరమును నగు పలుకులను పలుకవలెను. వేదాదులను చదువవలెను. వాటి మంత్రాదులను జపించవలెను. ఇవి వాచికతపములు.

*మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।*
*భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే ॥*

"ప్రసన్నమగుమనస్సు, సౌమ్యత్వము, మౌనము, ఇంద్రియనిగ్రహము, అంతఃకరణపారిశుద్ధ్యము- ఇవి మానసికమగు తపములు.

## శౌచము

శౌచము అనగా పవిత్రముగా నుండుట. ఇది రెండురకములు. బాహ్యశౌచము. అంతఃశౌచము. వీని భేదమును శంకరులు వివరించిరి:—

*బాహ్యమాభ్యన్తరం చేతి ద్వివిధం శౌచముచ్యతే ।*
*మృజ్జలాభ్యాం కృతం శౌచం బాహ్యం శారీరికం స్మృతమ్ ।*
*అజ్ఞానదూరీకరణం మానసం శౌచమాన్తరమ్ ।*
*అన్తఃస్థితో భవేత్సమ్యక్ బాహ్యం నావశ్యకం నృణామ్ ॥*

"శౌచము రెండురకములు. బాహ్యము. ఆంతరము. మృత్తిక, జలము మొదలగువానితో శరీరమును శుభ్రముచేయుట బాహ్యశౌచము. మనస్సుయొక్క అజ్ఞానమును పోగొట్టుట అంతఃశౌచము. మనుష్యులు అంతఃశౌచమును పొందుటకు ప్రయత్నించవలెను. బాహ్యశౌచము అంత ఎక్కువ అవసరముకాదు."

శౌచమును గురించి ఇతరగ్రంథములయందు కూడ వర్ణించబడినది.

*మనఃశౌచం, కర్మశౌచం, కులశౌచం చ భారత ।*
*శరీరశౌచం, వాక్‌శౌచం శౌచం పఞ్చవిధం స్మృతమ్॥*

"మనశ్శౌచము, కర్మశౌచము, కులశౌచము, శరీరశౌచము వాక్‌శౌచము అని 5 రకములు శౌచము."

## మనః శౌచము.

*శౌచం మానసం తు రాగద్వేషాది ప్రక్షాళనమ్ ।*

"అంతఃకరణమునుండి రాగద్వేషములను (ఆసుర, రాక్షస ప్రవృత్తులు) మొదలగువాసని పోగొట్టుట మానసికశౌచము."

## కర్మ శౌచము.

నిత్యనైమిత్తికకర్మములను నిష్కామముతో చేయుట కర్మ శౌచము. తన జీవితనిర్వహణమునకు కపటము, మోసము, ద్రోహము మొదలగునవి చేయకుండుట కర్మశౌచము.

## కులశౌచము.

శ్రేష్ఠకుటుంబమున జన్మించి, పారంపర్యముగా వైదికధర్మ మును ఆచరించుచు, హీనవ్యవహారము, హీనప్రవర్తన, హీనజీవిక (అనగా కన్యావిక్రయాది నీచకర్మలచే జీవించుట) చేయకుండుట. అట్టివాడు కులీనుడు. సదాచారమున స్థిరముగానుండుట, ఎట్టివిపత్తి కలిగినను నీచకర్మలను ఆచరించకుండుట స్వభావసిద్ధముగా నున్న వాడు కులీనుడనియు, అట్టిపని కులశౌచమనియు చెప్పబడును.

శరీరశౌచమనగా స్నానాదులచే శరీరమును శుభ్రముగా నుంచుట.

సత్యవాక్పాలనము వాక్శౌచము.

ఈ 5 రకములగు శౌచములయందును కర్మశౌచము, కుల శౌచము, శరీరశౌచము బాహ్యశౌచములు. వాక్శౌచము, మనః శౌచము ఆభ్యంతరశౌచములు. ఈ 5 రకములగు శౌచములును కావలసినవే. అయినను వానియందు మనఃశౌచము ప్రధానము. మిగిలిన శౌచములన్నియు మనఃశౌచముపై ఆధారపడియున్నవి, ఆత్మోన్నతికి మనఃశౌచమే మిక్కిలి ఉపయోగకరము.

మహాభారతము ఇట్లు చెప్పుచున్నది:—

*ఆత్మా నదీ సంయమపుణ్యతీర్థా సత్యోదకా శీలతటా దయోర్మిః ।*
*తత్రాభిషేకం కురు పాణ్డుపుత్ర, న వారిణా శుధ్యతి చాన్తరాత్మా ॥*

"ఓ ధర్మరాజా! ఆత్మచింతనము— అనగా పరమాత్మచింతనము అను నదికి సంయమము పవిత్రమగు రేవు. అందు సత్యమను జలము ప్రవహించుచుండును. శీలము అను నది తీరము. దయ అనెడు తరంగములు లేచుచుండును. ఆనదియందు స్నానము చేయుము. నీటిచే అంతరాత్మ శుద్ధిని పొందదు."

*నోదకక్లిన్నగాత్రస్తు స్నాత ఇత్యభిధీయతే ।*
*స స్నాతో యో దమస్నాతః సబాహ్యాభ్యన్తరః శుచిః ॥*

"నీటితో శరీరమును తడుపుట స్నానము కాదు. మనస్సును వశపరచుకొనుటయే స్నానము."

## క్షమ.

*బాహ్యే వాధ్యాత్మికే చైవ దుఃఖే చోత్పాదితే క్వచిత్ ।*
*న కుప్యతి న వా హన్తి సా క్షమా పరికీర్తితా ॥*

"ఎవడైనా తనకు అవమానమును చేసినను, తనను బాధించినను అతనిపై క్రోధించకుండుట, అతనిని బాధించకుండుటయును క్షమ."

క్షమనుగురించి భర్తృహరి ఇట్లు చెప్పెను:—"క్షమా ప్రభవిష్ణుః"

ఎవడైన వచ్చి తనకు శారీరికమగు బాధను కలుగజేసినను, మానసికసంతాపమును కలుగజేసినను తనకు ప్రతీకారముచేయు సామర్థ్యము కలిగియుండి ప్రతీకారము చేయకుండుట క్షమ. ఆక్షమ అలంకారమువంటిది. అసమర్థుడు ప్రతీకారము చేయలేకపోయినచో అది క్షమ అనిపించుకొనదు.

"శక్తానాం భూషణం క్షమా"

వ్యావహారికులును, జ్ఞానులును అగు జనులకు ఉండవలసిన [illegible] గుణము. ఇది సంసారజీవులకు సంబంధించినది. ఆశ

సన్న్యాసులు, సాధువులు పాటించవలసిన క్షమ ఇంతకు మించినది. ఎవరైన అపకారము చేసినను, దానిని పాటింపక ప్రత్యుపకారము చేయుట. ఎట్లనిన :-

ఒకమారు రామదాసుగారు శిష్యులతో చెరుకుతోటదగ్గర నుండి వెళ్ళుచుండిరి. శిష్యులు కొన్ని చెరుకుకర్రిలను విరచుకొని తినిరి. ఇంతలో యజమాని వచ్చెను. అడుగకుండ చెరుకుకర్రలు విరుచుకొని తినినందుకు కోపమువచ్చి, వారి అందరికి బెద్ద రామదాసుగారని తెలిసికొని ఆయనను గట్టిగా మోదెను. ఇది శివాజీ మహారాజుకు తెలిసెను. శివాజీ ఆతోటయజమానికి కబురంపెను. ఆతడు వచ్చునప్పటికి రామదాసుగారు సింహాసనముపైనను, శివాజీ క్రిందను కూర్చొని ఉండిరి. ఇదిచూచి తోటయజమాని గడగడ వణకసాగెను.

శివాజీ పలికెను "స్వామీ! ఆజ్ఞాపించుడు. తమ ఆజ్ఞప్రికారము శిక్షించెదను."

రామ:—నేను చెప్పినట్లు తప్పక చేయుదువా?

శివాజీ:—నేను తమ ఆజ్ఞను పాలించనివాడనా?

రామ:—ఇతడు బీదవాడు. తోట పాడగుటచే బాధ కలుగుట సహజము. కావున ఇతని దారిద్ర్యము పోగొట్టుటకు ఇతనికి జాగీరునిమ్ము. వంశపారంపర్యముగా అనుభవించు అధికారమునిమ్ము.

శివాజీ ఆప్రికారము వెంటనే దానపట్టా వ్రాసి ఇచ్చెను.

*ఉపకారిషు యస్సాధుః సాధుత్వే తస్య కో గుణః ।*
*అపకారిషు యస్సాధుః స సాధుః సద్భిరుచ్యతే ॥*

"తనకు ఉపకారము చేసినవానికి ఉపకారము చేయుటలో విశేషము ఏమిఉన్నది? అపకారము చేసినవానికి ఉపకారము చేసినవాడే సాధువని సత్పురుషులు చెప్పెదరు."

ఆసమయమున 'పీరడియా' రాజుగారు అక్కడనే ఉండిరి. వారివైపు చూచి శ్రీప్రకాశానందస్వామివారు ఇట్లనిరి. ఇట్టి క్షమ మావంటి సన్యాసులకేగాని మీవంటి రాజులకుకాదు.

క్షమా శత్రౌ చ మిత్రే చ యతీనామేవ భూషణమ్ ।
అపరాధిషు సత్త్వేషు నృపాణాం సైవ దూషణమ్ ॥

"శత్రువులయందును, మిత్రులయందును క్షమ కలిగియుండుట యతీశ్వరులకు అలంకారము. అపరాధుల విషయములో ఆవిధముగా ప్రవర్తించుట రాజులకు తప్పు."

సీతను రావణుడు తీసికొనివెళ్లినపుడు రాముడు ధర్మాత్ముడైనను అతనిని క్షమించలేదు. ఏలనన దుష్టులను దండించుట రాజనీతి.

మనుస్మృతియందు ఇట్లున్నది:—

అదణ్డ్యాన్ దణ్డయన్ రాజా దణ్డ్యాంశ్చైవాప్యదణ్డయన్ ।
అయశో మహదాప్నోతి నరకం చాధిగచ్ఛతి ॥

"రాజు, శిక్షింపరానివారిని శిక్షించినను, శిక్షింపవలసిన వారిని శిక్షింపక విడచినను గొప్ప అపకీర్తిని పొందుటయేకాక నరకమునుకూడ పొందును."

సమర్థరామదాసుగారు తమ యతిధర్మము ననుసరించి క్షమించుటయేగాక జాగీరు నిప్పించి ఉపకారము చేయుటయు, శివాజీ గురుశాజ్ఞాపరిపాలన తత్పరతతో వారు చెప్పినట్లు చేయుటయును నుభయులకు భూషణమే యగును.

## ఆ ర్జ వ ము

ఆర్జవం— నిష్కపటముగా నుండుట. అంతఃకరణమునందును ప్రవర్తనమునందును కపటము లేకుండుట. సాధువు మనో, వాక్, కర్మములయందు ఒకే రకముగా నుండును.

ఆర్జవం ధర్మమిత్యాహురధర్మో జిహ్మ ఉచ్యతే ।
ఆర్జవేనేహ సంయుక్తో నరో ధర్మేణ యుజ్యతే ॥

"నిష్కపటముగా నుండుట ధర్మము. కపటము అధర్మము. ఆర్జవముతోకూడిన మనుష్యుడుమాత్రమే ధర్మమును అనుసరించును."

## జ్ఞానము - విజ్ఞానము

జ్ఞానము అనగా సామాన్యజ్ఞానము. విజ్ఞానము అనగా విశేష జ్ఞానము. సామాన్యమగు అగ్ని కాష్ఠాదులయందు ఉండును. కాని అది అంధకారమును పోగొట్టలేదు. కాష్ఠాదుల ఘర్షణచే ప్రకటమయిన అగ్ని అంధకారమును పోగొట్టును. అటులనే సామాన్యచేతనము ఎల్లెడల వ్యాపించియున్నది. అది అజ్ఞానమునకు విరోధి కాదు. కాని వృత్తిరూపమగు విశేషచేతనపదార్థమే అజ్ఞానవిరోధి.

ఆ వృత్తి రెండురకములు. ప్రమ, అప్రమ. ప్రమ అనగా యథార్థజ్ఞానము. ఈ ప్రత్యక్షప్రమ బాహ్యప్రత్యక్షప్రమ, అంతః ప్రత్యక్షప్రమ అని రెండురకములు. బాహ్యములగు అర్థములు విషయములుగా కలది బాహ్యప్రత్యక్షప్రమ. అంతరార్థములు విషయములుగా కలది అంతఃప్రత్యక్షప్రమ.

మొదటిదగు బాహ్యప్రత్యక్షప్రమ మానసిక, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ భేదములచే ఆరు రకములు. రెండవదియగు అంతఃప్రత్యక్షప్రమ ఆత్మగోచరము. సుఖాదిగోచరము అని రెండు రకములు. ఆత్మవిషయకమగు ప్రమ ఆత్మగోచరము, సుఖ, దుఃఖాది విషయకమగు ప్రమ సుఖాదిగోచరము.

ఆత్మగోచరము అను ఈప్రమ విశిష్టాత్మవిషయము, శుద్ధాత్మవిషయము అని రెండు రకములు.

"అహం జీవః" "నేను జీవుడను" అను జ్ఞానము కలుగజేయునది విశిష్టాత్మవిషయము. "అహం బ్రహ్మాస్మి" "నేను బ్రహ్మమును" అను అభేదజ్ఞానమును కలుగజేయు ప్రమ శుద్ధాత్మవిషయము.

అప్రమ మూడు రకములు 1. స్మృతి, 2. సంశయము, 3. భ్రాంతి. స్మృతి యథార్థ, అయథార్థ భేదముచే రెండురకములు. యథార్థానుభవసంస్కారముచే కలుగు స్మృతి యథార్థస్మృతి.

సంశయము:— ఇది రజతమా, శుక్తియా అను జ్ఞానము సందేహము. ఒకే విషయమునందు అనేకరకములగు జ్ఞానములు కలుగుట సందేహము.

భ్రాంతి:— శుక్తియందు రజతమను భావము కలుగుట భ్రాంతి.

## ఆస్తికత్వము.

పరమాత్ముడు సత్యము; స్వర్గనరకములును, బంధమోక్షములును సత్యములు; వేదములు ఈశ్వరకృతములు; అను బుద్ధి ఆస్తికత్వము. ఈ ఆస్తికత్వబుద్ధికలవాడును, కర్మను ఉపాసించువాడును మాత్రమే పరమాత్మ స్ఫురణమును పొందును.

*నైవ వాచాన మనసా ప్రాప్తుం శక్యోన చక్షుషా।*
*అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే॥*

"ఆత్మతత్త్వము వాక్కుచేతనుకాని, మనస్సుచేతనుకాని, నేత్రముల చేతనుగాని గ్రహించవీలుపడదు. ఆత్మతత్త్వము కలదు అను ఆస్తికునకుతప్ప, నాస్తికునకు అది ఎట్లు లభ్యమగును?"

*అస్తీత్యేవోపలబ్ధవ్యస్తత్త్వభావేన చోభయోః।*
*అస్తీత్యేవోపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి॥*

"ఆస్తిత్వభావముతో ఆత్మతత్త్వము పొందనగును. తత్త్వభావము చేతనుకూడ అది పొందనగును. ఆత్మ ఉన్నది అనునది తెలిసికొనిన వానికే ఆత్మయొక్క సత్యస్వరూపము ప్రత్యక్షమగును."

ఇట్లు బ్రాహ్మణుని స్వాభావికగుణములు తొమ్మిది చెప్పబడినవికదా! ఇందులో ఎన్ని నీయందు కలవు?

రాఘవ :—నాయందు ఒకటియును లేదు. తమరు దయయుంచిన రావచ్చును.

అనంతరము నిద్రించుటకు వెళ్ళునప్పుడు రాఘవజీభాయి ఇట్లనెను:—

“నేను వచ్చినంతనే సన్యాసులను విమర్శించితిని. అది మహాత్ములకు సంబంధించదు. కాని ఈరోజులలో ఎక్కడచూచినా అల్పజ్ఞులు కాషాయవస్త్రము ధరించి, నాలుగుఅక్షరములు కంఠస్థముచేసి ఉపన్యాసములిచ్చి మోసము చేయుచున్నారు. పెద్దపెద్దవారికి గురువులయి కూర్చొనుచున్నారు. వారిని తప్పుత్రోవ త్రొక్కించుచున్నారు. వారివిషయములో నేను అట్లు చెప్పితిని. అపరాధము క్షమింపుడు.

స్వా.ని.:— “మీరు చెప్పినది అసత్యము కాదు. అక్షరాల నిజము.” అనంతరము ప్రకాశానందులవారిని ఉద్దేశించి చెప్పిరి:— “మీరే చెప్పండి. రాఘవజీభాయి అసత్యము చెప్పెనా!”

స్వా॥ ప్ర॥ :—విష్ణుపురాణమున కలియుగవర్ణన సందర్భమున ఇట్లున్నది :—

భైక్ష్యావృత్త్యా తథా శూద్రాః ప్రవ్రజ్యాలిఙ్గినోఽధమాః।
పాఖణ్డసంశ్రియాం వృత్తిమాశ్రయిష్యన్త్యసంస్కృతాః॥

(కలియుగములో) అధములు, సంస్కారహీనులు, శూద్రులు సన్యాసివేషధారులై భిక్షావృత్తిని ఆశ్రయింతురు. పాఖండాచారులగుదురు.

బృహన్నారద పురాణమున కలియుగవర్ణన సందర్భమున ఇట్లున్నది—

కాషాయపరివీతాశ్చ జటిలా భస్మధూలితాః।
శూద్రా ధర్మాన్ప్రవక్ష్యన్తి కూటయుక్తిపరాయణాః॥

“శూద్రులు కాషాయాంబరములను జటలను ధరించి, భస్మము పూసికొని కూటయుక్తిపరాయణులై ధర్మములను చెప్పుదురు.”

కపటులు కొందరు ఆడంబరముకొరకు ముండితసన్యాసమును గైకొని పెద్దపెద్ద రుద్రాక్షలు ధరించి గీత, ఉపనిషత్తులు మొదలగు వేదాంతగ్రంథములనుగురించి ఉపన్యసించెదరు. అందుకొరకు ధనము నార్జించి, మఠములు, మందిరములు కట్టించెదరు. సకలభోగములను అనుభవించెదరు.

మరికొందరు జటిలసన్యాసము తీసికొని అక్కడక్కడ బైరాయించి సంపాదింతురు. మఠములు కట్టించి తమలోతాము వైరములు పెంచుకొనెదరు.

ఇంకను కొందరు భస్మమును ధరించి పంచాగ్నులను వ్రేల్చి, రామాయణాదుల కాలక్షేపము చేయుదురు. రకరకములగు మార్గములచే కపటనాటకములు ఆడి అజ్ఞానులను వలలో వేసికొనెదరు.

ఈవిషయమున తుకారాముకూడ తమఅభంగములో ఇట్లు చెప్పెను:—

"పురాణాదికాలక్షేపములు చేయు మనుష్యుల మనస్సుల యందు ఆశ, తృష్ణ ఉన్నప్పుడు వినువారి మనస్సులయందుకూడ ఈ శాస్త్రిలుగారు, లేక హరిదాసుగారు మనలను ఏమియు అడగకుండ ఉండరు అను భయము కలుగును. దాసుగారు ఏమి చెప్పుచున్నను వారి లక్ష్యము దానియందు ఉండదు. వారి ప్రతిమాటయు వినువారి నుండి ద్రవ్యమును సంపాదించువైపునకు మొగ్గియుండును. కథ చెప్పు వారు దురాశాపరులు, వినువారు పిసినిగొట్టువారు. ఈస్వభావము కలవారి బ్రతుకు పిల్లివంటిది. పిల్లి ఇంటింటికి పోయి కడుపునింపుకొనును. వారి భజనాదులు అన్నియు వ్యర్థములు. శ్రోత, వక్త ఇరువురియందును ఒకరికిని ఏఫలమును కలుగదు. చెవిటివాడును, మూగవాడును ఇరువురును కలసినచో ఏపనియు చేయలేరు. అటులనే పై శ్రోతలును, వక్తలును కూడ అసమర్థులు. కళ్ళములోని ధాన్యము

కాటాపై తూచబడనంతవరకు తూచువాని తూకపురాళ్ళు, ధాన్యము రెండును నిరుపయోగము:

"నోటితో కథలు చెప్పువారి మాటలు పైకి ఎంతయో తియ్యగా నుండును. కాని వారి మాటలను అనుసరించి వారి మానసిక స్థితియుండదు. వారిమాటలు నేతిబీరకాయవంటివి. ఈ అబద్ధాలకోరులకు, డాంబికులకును ఈప్రపంచముననే ఏమాత్రమును సుఖము కలుగదు. ఇక పరలోకముసంగతి చెప్పనేల? మాటలు, చేతలు సమానముగాఉండి, పరమార్థవిషయమున మచ్చరానియ్యని మనుష్యులకు నేను నమస్కారము చేయుదును.

కొందరు హరికథ చెప్పుసమయమున ఎంతయో భక్తిని, భగవత్ప్రేమను ప్రకటించుదురు. కాని వారి మనస్సులు పాపకృత్యముల యందు అభిరుచితో నిండియుండును. వారి చెవియందు తులసీ దళము ఉండును. శిఖలను దర్భలతో కట్టుకొనెదరు. ఇట్లు పై అట్టహాసములతో ముక్కుమూసికొని ధ్యానముచేయుచున్నట్లు అభినయము చేయుదురు. శరీరమును ద్వాదశఊర్ధ్వపుండ్రములతో అలంకరించుదురు. భక్తులవేషము వేసికొనెదరు. కంఠములో తులసిమాల ధరించెదరు. దేవుని ఎదుట ఎంతయో బాగుగా కథ చెప్పుటకు కూర్చొనెదరు. కథ చెప్పుచు మధ్యమధ్య ఏడ్చెదరు. నవ్వెదరు. మూర్ఛిల్లెదరు. ఆనందబాష్పములను రాల్చెదరు. అట్టివారు అందరును అబద్ధాలకోరులు. మోసగాండ్రు. దేవునియందు సగముదృష్టి, స్వార్థమునందు సగముదృష్టి కలిగియుందురు.

కలియుగమునందలి కవులుకూడ పాఖండులే. కబుర్లపోగులు, బూతుకవులు నేడు గొప్పకవులుగా గణింపబడుచున్నారు. వారి మనస్సు, ధనమునందో, స్త్రీయందో, లేక బిడ్డలయందో తగులుకొని యుండును. నోటినుండి వైరాగ్యపు అసత్యప్రసంగములు

వెలువడుచుండును. ప్రజలనుండి గౌరవమును పొందుటకు సాధుత్వ మును ప్రదర్శించెదరు. కవిత్వపు నోటినుండి త్యాగ వైరాగ్యములతో నిండిన అలంకార భూయిష్ఠమగు రచనలు వచ్చును. కాని అవి అన్నియు డాబుమాత్రమే. వారినోరు మాట్లాడినదానిలో ఒకవంతు అయినను వారి మనస్సునందు ఉండదు. ఆత్మ శరీరమునకు, ఇంద్రియ ములకును అతీతమనియు, దేహమునకు నిర్లిప్తముగా నుండుటచేతనే ఆత్మస్థితి సిద్ధించుననియు వేదములు చెప్పును. ఆమాట నిజమే. కాని ఈ ఆత్మోపదేశకులు ఆప్రకారము సంచరించరు. ఇట్టివారు చివరకు యమభటుల పాలగుదురు. వారి మాటలకును, చేతలకును సంబం ధము లేకపోవుటయే ఇందుకు కారణము.

కొందరు సాధువుల వేషము ధరించి అనేకమందిని మోసము చేయుదురు. వారినుండి డబ్బుదండి తమ కుటుంబమును పోషించు కొనెదరు. పంజరమునందలి చిలుకలు మనుష్యవాక్కులు పలికినట్లు ఈ మోసగాండ్రు పలికి తమ సంభాషణలద్వారా స్త్రీపురుషుల మన స్సులను సంతోషపెట్టుదురు. గంగిరెద్దువలె గురువు చెప్పినట్లు బుర్రె ఊపెదరు. సూత్రధారుడు చెప్పినట్లు నటులు నటించిన విధముగా వారు తమగురువు చెప్పినట్లు బ్రహ్మజ్ఞానోపదేశములను పలుకుచు తిరిగెదరు. ఈ పనికిరానివాళ్లను ఏమన్నను వారికి సిగ్గురాదు. వారి మహత్త్వము కాల్చనా?

మాట్లాడుసమయమున వారు అంతులేని బ్రహ్మజ్ఞులనిపించును. కాని మనస్సును గౌరవమునకును, ఆశకును దాసిగా వినియోగించు దురు. కడుపు నింపుకొనుటకు సత్పురుషుల వేషమువేసికొను తుంట రులు కలియుగములో చాలమంది ఉన్నారు. సరియగు సత్పురుషులు కొలదిమంది మాత్రమే కలరు. అట్టివారికి సాష్టాంగనమస్కారము చేయుదును." అని తుకారామ్ చెప్పిరి.

రాఘవ:—తుకారాము చరిత్ర చదివినచో ఆయన చాల కోమలహృదయుడుగా తోచును. కాని ఈపై అభంగములో ఆయన ఇంత కాఠిన్యము ఎందుకు ప్రకటించెను?

స్వా॥ ప్ర॥ :—ధర్మాత్ములు అధర్మమును చూచి సహించలేరు. కావున తీవ్రమగు పదజాలముతో ఉపన్యసించెదరు. ఇందు ఆశ్చర్యములేదు. జీసస్‌క్రీస్తు ఎంతయో కోమల హృదయుడు, దయార్ద్రచిత్తుడును. అయినను యహూదీ మతగురువులు దేవమందిరములలో దుకాణములు పెట్టుకొని కూర్చొనినప్పుడు వారిని ఆపుటకు వెళ్ళెను. అది మతగురువులకు నచ్చలేదు. అంతట వారు అతనిపై అసత్యముగా నేరారోపణముచేసి క్రౌర్యముతో ఆయనను సిలువవైచిరి. అప్పుడుకూడ "ఈమతగురువులను క్షమించు"మని ఆయన దేవుని ప్రార్థించెను.

ఇంత దయార్ద్రహృదయు డయినను ఆయన ధర్మస్థలములలో జరుగుచున్న అధర్మములను చూచి ఆయన తన శిష్యులకు ఏమి ఉపదేశించెనో చూడుడు:—

"గొప్పవార మనుకునే ఈమతగురువులు ధర్మాసనమున కూర్చొని ధర్మములను చెప్పుచున్నారు. వారు ఆజ్ఞాపించినట్లు చేయుండి. వారు చేసినట్లు చేయకండి. ఏలనన, ఆవిధముగా వారే ప్రవర్తించుటలేదు. అందరిచేత వెట్టిచాకిరీ చేయించుకొనుచున్నారు. వారికి ఏమాత్రము సహాయము చేయుటలేదు. ఇతరులు చూచుట కొరకు మాత్రమే వారు తమ పనులు అన్నియు చేయుచున్నారు. వారు ఆత్మశ్లాఘాపరాయణులు. విందు భోజనములలోను, సభలలోను అగ్రాసనములు వారివి. అందరు నమస్కారము చేయవలెనని వారి కోరిక. అందరు వారిని "మతగురువులు" అనవలెనని వారికోరిక కాని వారు మతగురువులు కారు అనకండి. అందరకు దేవుడు ఒక్కడే

గురున్న. మీరందరు సోదరులు. భూమిమీద ఉన్నవాడు ఎవడును మీకు తండ్రికాడు. ఆకాశమున ఉన్న ఆఒకడే మీతండ్రి. వీరు ఎవ్వరు మీయజమానులుకారు. ఆకాశమున ఉన్న ఆదేవుడు ఒకడే మీయజమాని. తాను గొప్పవాడననుకొనువాడు మీసేవకుడు. తాను గొప్పవాడవవలెను అనుకొనువాడు క్రిందకు పోవును. తాను క్రిందనుండవలె ననుకొనువాడు గొప్పవాడగును."

ఆమతగురువులను ఎట్లు విమర్శించెనో చూతుము.

"ఓకపటులారా! మీరు ఎంత తెలివిమాలినవారు. ప్రజలనుండి వారిస్వర్గరాజ్యము దూరము చేసిరి. అక్కడకు మీరు వెళ్ళలేరు. మీరు వెళ్లలేనిచోటికి వెళ్లదలచినను ఇతరులను వెళ్లనివ్వరు."

మరియొకచోటకూడ బైబిలులో ఇట్లు చెప్పెను :-

"ఈ అసత్యప్రచారకులు దొంగవేషములతో మీవద్దకు వచ్చెదరు. వీరు స్పృహతప్పించు మద్యమువంటివారు. వీరినుండి జాగ్రత్తగా నుండుడు. వారివలన కలుగుఫలితమునుబట్టియే వారిని గుర్తింపనచ్చును. ముండ్లపొదనుంచి ద్రాక్షగుత్తులు లభించునా? ప్రతిమంచిచెట్టున్ను మంచిఫలము ఇచ్చును. ప్రతిచెడుచెట్టున్ను చెడు ఫలమును ఇచ్చును. మంచిచెట్టు చెడుఫలమును ఇవ్వలేదు."

స్వా. ప్ర. :—తాత్పర్యమేమన ఆదొంగలకు గౌరవము పొందవలెనను కోరికయే కలదు. ప్రజలకు ఏదియైన మంచి ఉపదేశమునిచ్చి బాగుచేయుట వారి యుద్దేశ్యము కాదు. గ్రామమును రక్షించుటకు గ్రామాధికార్లు "మేలొకనండి" అని టముకు వేయించిన ఏమయిన లాభము కలదా? అటులనే అసురప్రకృతికలవారు అధర్మము తప్పని ఎన్నివిధముల చెప్పినను దానిని ఆపలేరు. సత్పురుషులు మాత్రము అజ్ఞానదుర్విదగ్ధులగు జనులను అధర్మమునుండి రక్షించుటకు అవసరమగు సూచనలను అన్నిటిని చేయగలరు.

స్వా.ని. :—క్రీస్తు అంతకాఠిన్యముతో చెప్పినదికూడ ప్రజలయందలి కరుణచేతనే. పిల్లవాడు నేలనూతివద్దకు వెళ్ళునప్పుడు తండ్రి వానిని క్రోధముతో ఆపును. అట్లుచేయుట వానియందలి ద్వేషముచే కాదు. దయచేతనే. ఇటులనే శరీరముపై తేలుపాకుచుండగా చూచి నిద్రమేల్కొలుపుట అతనికి ఉపకారముచేయుటయే. కబీరు, తుకారాము, అఖా మొదలగు సత్పురుషులందరు చెప్పునవి మనమేలు కొరకుమాత్రమే. వారు మనకు ఎంతయో ఉపకారము చేసినట్లుగనే భావించవలెను.